తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక





హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | మంగళవారం | 17 - 02 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజీలు : 4


# మోత్కూరు మున్సిపల్
# కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారోత్సవం

- మొదట హాజరైన బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- ఆ తర్వాత హాజరైన క్యాంప్‌లో ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు
- కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి వచ్చిన ఎమ్మెల్యే సామేల్
- సమావేశం లోపలికి అనుమతి లేకపోవడంతో వెళ్లిపోయిన ఎమ్మెల్యే
- 5వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ చేరికతో 9కి చేరిన కాంగ్రెస్ బలం

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూర్ మున్సిపల్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం కోసం పాత గ్రామ పంచాయతీ భవనంలో ఎన్నికల అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ అయిన జి. సురేష్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం తో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ గా నియమించారు. మొదట బీఆర్ఎస్ కౌన్సిలర్లు 3వ వార్డు సుల్తాన్ స్వామి, 4వ వార్డు కొండ శోభ, 10వ వార్డు నల్ల మధు 10.30 గంటలకు సమావేశానికి రాగా, క్యాంప్ లో ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు 1వ వార్డు పల్లెర్ల వెంకన్న, 2వ వార్డు కుర్మిల్ల ప్రమీల, 6వ వార్డు గడ్డం స్వప్న, 7వ వార్డు గనగాని శైలజ, 8వ వార్డు పన్నాల శ్రీవిద్య, 9వ వార్డు బీసు శ్రీకాంత్, 11వ వార్డు కారుపోతుల వెంకన్న, 12వ వార్డు మెంట రమణతో పాటు ఇండిపెండెంట్ గా గెలిచి కాంగ్రెస్ లో చేరిన 5వ వార్డు కౌన్సిలర్ మొగుళ్ల అనురాధ కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి ఉదయం 10.40కి వచ్చారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి వెంట రాగా సమావేశం లోపలికి రావడానికి అనుమతి లేకపోవడంతో ఆయన వెళ్లిపోయారు. సమావేశం హాల్ లో కాంగ్రెస్ కౌన్సిలర్లకు కుడి వైపున, బీఆర్ఎస్, స్వతంత్ర కౌన్సిలర్ కు ఎడమ వైపున తెలుగు అక్షరమాల ప్రకారం సీటింగ్ ఏర్పాటు చేశారు. స్పెషల్ ఆఫీసర్ సురేష్ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఉదయం 11 గంటలకు మొదట కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. తెలుగు అక్షర మాల ప్రకారం కౌన్సిలర్లతో 11వ వార్డు కారుపోతుల వెంకన్న, 2వ వార్డు కుర్మిళ్ల ప్రమీల, 4వ వార్డు కొండ శోభ, 6వ వార్డు గడ్డం స్వప్న, 7వ వార్డు గనగాని శైలజ, 10వ వార్డు నల్ల మధు, 8వ వార్డు పన్నాల శ్రీవిద్య, 1వ వార్డు పల్లెర్ల వెంకన్న, 9వ వార్డు బీసు శ్రీకాంత్, 12వ వార్డు మెంట రమణ, 5వ వార్డు మొగుళ్ల అనురాధ, 3వ వార్డు కౌన్సిలర్ సుల్తాన్ స్వామితో ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

1వ వార్డు



పల్లెర్ల వెంకన్న (కాంగ్రెస్)

2వ వార్డు



కుర్మిళ్ల ప్రమీల (కాంగ్రెస్)

3వ వార్డు



సుల్తాన్ స్వామి (బీఆర్ఎస్)

4వ వార్డు



కొండ శోభ (బీఆర్ఎస్)

5వ వార్డు



మొగుళ్ల అనురాధ (ఇండిపెండెంట్)

6వ వార్డు



గడ్డం స్వప్న (కాంగ్రెస్)

7వ వార్డు



గనగాని శైలజ (కాంగ్రెస్)

8వ వార్డు



పన్నాల శ్రీవిద్య (కాంగ్రెస్)

9వ వార్డు



బీసు శ్రీకాంత్ (కాంగ్రెస్)

10వ వార్డు



నల్ల మధు(బీఆర్ఎస్)

11వ వార్డు



కారుపోతుల వెంకన్న (కాంగ్రెస్)

12వ వార్డు



మెంట రమణ (కాంగ్రెస్)

# ఆర్థిక సాయం అందజేత



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం బుజిలాపురం గ్రామానికి చెందిన గుండు మారెమ్మ ఇటీవల మృతి చెందగా సోమవారం కోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కోక భిక్షం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మారెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పసునూరి యాదయ్య, ఆకుల అంజయ్య, పంగ వెంకన్న, ఆకుల రాములు, ఆకుల లింగస్వామి, పంజాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూరు మున్సిపల్ చైర్మన్‌గా గడ్డం స్వప్నసోమనర్సయ్య






- 6వ వార్డు కౌన్సిలర్‌గా ఘన విజయం
- ఎమ్మెల్యే, ఎంపీ ఆశీస్సులతో చైర్మన్ పీఠం
- ఎమ్మెల్యే, ఎంపీ, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపిన చైర్మన్ స్వప్నసోమనర్సయ్య
- మున్సిపల్ డెవలప్‌మెంట్ కోసం కృషి చేస్తా

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపల్ చైర్మన్‌గా 6వ వార్డు కౌన్సిలర్ గడ్డం స్వప్న సోమనర్సయ్య ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో చైర్మన్ పదవి ఇద్దరు కౌన్సిలర్లు పోటీ పడగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆశీస్సులతో చైర్మన్ పీఠం స్వప్నసోమనర్సయ్యకు దక్కింది. కాంగ్రెస్ అధిష్ఠానం చైర్మన్, వైస్ చైర్మన్లను ఖరారు చేసి మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్‌కు బీఫాంతో పాటు విప్ జారీ చేసింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించగా 8వ వార్డు కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్య చైర్మన్‌గా 6వ వార్డు కౌన్సిలర్ గడ్డం స్వప్నను ప్రతిపాదించగా 7వ వార్డు కౌన్సిలర్ గనగాని శైలజ బలపర్చారు. పోటీ లేకపోవడంతో చైర్మన్‌గా గడ్డం స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. గడ్డం స్వప్నసోమనర్సయ్యలది మొదటి నుంచి కాంగ్రెస్ కుటుంబం. కాంగ్రెస్‌లో స్వప్న భర్త సోమనర్సయ్య సామాన్య కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు నాయకులు, కార్యకర్తలందరి మద్దతుతో అవకాశం వచ్చిందని, తమ గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు పని చేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సామేల్ అండదండలు, ఆశీస్సులతో మున్సిపల్ చైర్మన్ పదవి వచ్చిందని, జీవితాంతం కాంగ్రెస్‌కు, ఎమ్మెల్యే సామేల్, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, మద్దతునిచ్చిన కౌన్సిలర్లకు, 6వ వార్డు ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో స్థానిక నాయకులు, కౌన్సిలర్లను కలుపుకుని పని చేస్తామని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తామన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన స్వప్నసోమనర్సయ్యను ఎమ్మెల్యే సామేల్ సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.






# ముశిపట్లలో కన్నుల పండువగా..

# శ్రీబుగ్గ రామలింగేశ్వరస్వామి కళ్యాణోత్సవం..అగ్ని గుండాలు



- భక్తుల శివనామ స్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం
- స్వామివారిని దర్శించుకోవడానికి భారీగా తరలివచ్చిన భక్తులు



**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూర్ మండలం ముశిపట్ల గ్రామంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వరస్వామి కళ్యాణోత్సవం కన్నుల పండువగా వైభవంగా జరిగింది. మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా పురోహితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం తిలకించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కళ్యాణోత్సవాన్ని పురోహితులు ప్రదీప్‌శర్మ, సందీప్‌శర్మలు నిర్వహించగా దేవాలయ ఇంచార్జ్ ఈవో రాంగోపాల్‌రావు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. సోమవారం ఉదయం గుట్ట కింద అగ్నిగుండాలు నిర్వహించారు. భక్తులు ఖడ్గాలు చదివారు. ప్రభలతో ఆకట్టుకున్నారు. శివనామ స్మరణతో భక్తులు అగ్నిగుండాలు తొక్కారు. స్వామివారి కల్యాణం, మహా శివరాత్రి కావడంతో పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుని, టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైళ్ల నర్సిరెడ్డి, ఉప సర్పంచ్ అంజయ్య, వార్డు సభ్యులు, దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.శేఖర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



# మోత్కూరు మున్సిపల్.. చైర్మన్‌గా గడ్డం స్వప్నసోమనర్సయ్య

## వైస్ చైర్మన్‌గా పల్లెర్ల వెంకన్న







- పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నిక
- మున్సిపల్ పీఠంపై మూడో మహిళా చైర్మన్
- చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను సన్మానించి శుభాకాంక్షలు చెప్పిన ఎమ్మెల్యే సామేల్

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ చైర్మన్‌గా గడ్డం స్వప్నసోమనర్సయ్య, వైస్ చైర్మన్‌గా పల్లెర్ల వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం మున్సిపల్ కేంద్రంలోని పాత గ్రామపంచాయతీ భవనంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డులకు గాను కాంగ్రెస్ 8 వార్డులు, బీఆర్ఎస్ 3 వార్డులు, ఒక ఇండిపెండెంట్ గెలుపొందారు. కాంగ్రెస్ తమ కౌన్సిలర్లకు విప్ జారీ చేయడంతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎంపిక చేసి బీఫాంలు అందజేశారని, విప్‌ను ధిక్కరిస్తే సభ్యులు అనర్హతకు గురవుతారని మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ సురేష్ ప్రకటించారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం పూర్తి కోరం ఉండటంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు పల్లెర్ల వెంకన్న, కుర్మిళ్ల ప్రమీల, గడ్డం స్వప్న, గనగాని శైలజ, పన్నాల శ్రీవిద్య, బీసు శ్రీకాంత్, కారుపోతుల వెంకన్న, మెంట రమణ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు సుల్తాన్ స్వామి, కొండ శోభ, నల్ల మధు, ఇండిపెండెంట్ మొగుళ్ల అనురాధ హాజరయ్యారు. చైర్మన్ కోసం ఎన్నిక నిర్వహించగా 8వ వార్డు కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్య 6వ వార్డు కౌన్సిలర్ గడ్డం స్వప్నను ప్రతిపాదించగా 7వ వార్డు కౌన్సిలర్ గనగాని శైలజ బలపర్చారు. పోటీ లేకపోవడంతో మెజార్టీ కోరంతో గడ్డం స్వప్న చైర్మన్‌గా ఎన్నికైనట్టు ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ సురేష్ ప్రకటించారు. అనంతరం వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా 11వ వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న 1వ వార్డు కౌన్సిలర్ పల్లెర్ల వెంకన్నను ప్రతిపాదించగా 9వ వార్డు కౌన్సిలర్ బీసు శ్రీకాంత్ బలపర్చారు. పోటీ లేకపోవడంతో వైస్ చైర్మన్‌గా పల్లెర్ల వెంకన్న ఎన్నికైనట్టు ప్రకటించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయించి ఎన్నికల ఆఫీసర్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ముగిసే వరకు కూడా ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశంలోనే కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ ప్రభాకర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


### మున్సిపల్ పీఠంపై మూడో మహిళా చైర్మన్


మోత్కూరు మున్సిపల్ పీఠంపై మూడో మహిళా చైర్మన్ కొలువుదీరారు. మోత్కూరు మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత రెండోసారి ఎన్నికలు జరిగాయి. 2018 ఆగస్టు 2న కొత్త మున్సిపాలిటీగా ఏర్పడగా 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి. మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ 7 స్థానాల్లో గెలిచి మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. చైర్మన్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ కాగా తొలి మున్సిపల్ చైర్మన్‌గా తీపిరెడ్డి సావిత్రిమేఘూరెడ్డి ఎన్నికయ్యారు. 2023లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, మున్సిపాలిటీలో మారిన రాజకీయ సమీకరణాలు, కౌన్సిలర్ల అసంతృప్తితో చైర్మన్ సావిత్రిమేఘూరెడ్డిపై అవిశ్వాసం పెట్టారు. అవిశ్వాసంతో సావిత్రిమేఘూరెడ్డి చైర్మన్ పదవి కోల్పోగా, కాంగ్రెస్ కౌన్సిలర్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి చైర్మన్ అయ్యారు. కౌన్సిల్ ఐదేళ్ల పదవీకాలంలోనే ఇద్దరు మహిళలు చైర్మన్ పదవి చేపట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యింది. దీంతో 8 వార్డుల్లో గెలిచిన కాంగ్రెస్ మున్సిపాలిటీని కైవసం చేసుకోగా 6వ వార్డు (ఎస్సీ జనరల్) నుంచి కాంగ్రెస్ కౌన్సిలర్‌గా గెలుపొందిన గడ్డం స్వప్నసోమనర్సయ్య మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో ముగ్గురు మహిళలు చైర్మన్ పదవుల్లో కొలువుదీరినట్టు అయ్యింది. కాంగ్రెస్‌లో చైర్మన్ పదవి కోసం 12వ వార్డు కౌన్సిలర్ మెంట రమణనగేష్, వైస్ చైర్మన్ పదవి కోసం 9వ వార్డు కౌన్సిలర్ బీసు శ్రీకాంత్ తీవ్రంగా పోటీ పడినప్పటికీ ఎమ్మెల్యే, ఎంపీ ఇద్దరిని బుజ్జగించడంతో వెనక్కి తగ్గారు. పోయిన సారి వైస్ చైర్మన్ పదవి బీసీకి దక్కగా, ఈసారి వైస్ చైర్మన్ పదవి వైశ్య సామాజికవర్గానికి దక్కింది.

### కౌన్సిలర్లను సన్మానించిన ఎమ్మెల్యే సామేల్

సమావేశం ముగిసిన అనంతరం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చైర్మన్ స్వప్న, వైస్ చైర్మన్ వెంకన్నతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లను సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేశామని, మెయిన్ రోడ్డు, అంగడి బజారు సీసీ రోడ్డు చేశామని, పెద్ద చెరువులో కలుస్తున్న డ్రైనేజీని మళ్లించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, బృందావన్ కాల్వ వెంట ఉన్న ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో కాల్వను శుభ్రం చేయిస్తామన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో మున్సిపాలిటీని సుందర నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.











# సమాజ సేవకునికి ప్రజాపట్టం

## మోత్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పల్లెర్ల వెంకన్న

- ఐదారేండ్లుగా సమాజ సేవలో పల్లెర్ల వెంకన్న ఎన్నికల్లో అందివచ్చిన కౌన్సిలర్ అవకాశం
- ఆదరించి అక్కున చేర్చుకున్న ప్రజలు
- 1వ వార్డు నుంచి భారీ మెజార్టీతో గెలుపు
- ప్రజా ఆశీర్వాదంతో మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి
- మోత్కూరు ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా
- ప్రజల కష్టాల్లో పాలు పంచుకుంటా..అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే, ఎంపీ, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు

ప్రజావారధి/మోత్కూరు

ఓ సాధారణ యువకుడు..చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి..కష్టపడి పనిచేస్తూ ఒక్కో మెట్టు ఎక్కాడు. తాను సంపాదించిన దాంట్లో కొంత సమాజ సేవకు వినియోగించాడు. సుమారు ఐదారేండ్లుగా నిస్వార్థంతో తనకున్న దాంట్లో కొంత చదువులకు, కష్టాల్లో ఉన్న పేదలకు, కళాకారులకు, దేవాలయాలకు, దైవ కార్యాలయాలకు, అయ్యప్పస్వాములకు, ప్రజలకు తాగునీటి కోసం సాయం చేస్తూ ప్రజల మన్ననలు పొందాడు. మోత్కూరుతో పాటు చుట్టుపక్కల నాలుగైదు గ్రామాల్లో తన శక్తి మేరకు సాయం చేస్తూ ఐదారేండ్ల కాలంలో సుమారు రూ.30 లక్షల మేర సమాజ సేవకు ఖర్చు చేశాడు. ప్రజల మన్ననలు పొందిన ఆ యుడకుడే మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన పల్లెర్ల వెంకన్న. మున్సిపల్ ఎన్నికల్లో అనుకోకుండా కాంగ్రెస్ నుంచి 1వ వార్డు కౌన్సిలర్‌గా అవకాశం వచ్చింది. వెంకన్న చేసిన సేవలతో ప్రజలు ఆదరించి అక్కున చేర్చుకున్నారు. యువత అంతా వెంకన్న వెంటే నడిచారు. 1వ వార్డు నుంచి ఏకపక్షంగా ప్రజా ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలుపొందారు. స్థానికంగా ఉండి ప్రజల మెప్పు పొందితే..ప్రజాక్షేత్రంలో విజయం ఎలా ఉంటుందో పల్లెర్ల వెంకన్న చూపించారని అంతా చర్చించుకుంటున్నారు.

### మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పల్లెర్ల వెంకన్న

మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలుపొందిన వెంకన్నకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆశీస్సులతో మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి దక్కింది. వైస్ చైర్మన్ పదవి కోసం కొంత పోటీ ఉన్నా ఎమ్మెల్యే, ఎంపీ, మిగతా కౌన్సిలర్లు వెంకన్న వైపే మొగ్గు చూపడంతో ఉన్నత పదవి అవకాశం కలిసివచ్చింది. కౌన్సిలర్‌గా గెలుపొందడం, మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి రావడంతో అంతా ప్రజా ఆశీర్వాదమేనని, వారికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం వార్డులో ఇంటింటికి వెళ్లి వెంకన్న కృతజ్ఞతలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు. తనకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే సామేల్, ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లకు, జిల్లా, మండల, పట్టణ నాయకులకు, కార్యకర్తలకు, యువకులకు, తన కోసం పని చేసిన వారందరికీ తాను ఎల్లవేళలా రుణపడి ఉంటానని, తన గెలుపు కోసం పనిచేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళతానని హామీ ఇచ్చారు. తన వార్డులోని ఆడపడుచులకు ఆడ బిడ్డ పుడితే రూ.5116, ఆడ బిడ్డ పెళ్లికి రూ.5116 అందిస్తానని ప్రకటించారు. కష్టపడి చదువుకునే నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు తనవంతు సహాయం అందిస్తానన్నారు. తనకు వచ్చిన పదవిని సద్వినియోగం చేస్తూ ప్రజల సంక్షేమం, వార్డుతో పాటు పట్టణంలో సమస్యల పరిష్కారం, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తానన్నారు.



